# నాకోసం ఒక కన్నీటి బొట్టు



ఆ చుట్టు పక్కల పది మేడలు మాత్రం ఉన్నాయి. ఇంకా పైకి పోతే కొబ్బరి తోటలు, రోడ్డుకి అటూ ఇటూ కనిపించే పచ్చని పైర్లు, దూరంగా నీలి నీలి కొండలు మాత్రం కనువిందు చేస్తూ కనపడతాయి. పల్లె నుంచి అడ్డ దోవలో వచ్చే జనం తప్ప, ఆ రోడ్డు మీద ఎవరూ ఉండరు సాధారణంగా. సాయంకాలాలు మాత్రం చాలామంది ఒంటరిగానూ, జంటగానూ వాకింగ్‌గా అటు వైపు నడుస్తూ ఉంటారు.

అక్కడ ఉన్న పది మేడల్లోనూ ఠీవిగా, ఆలివ్ గ్రీన్ కలర్ పెయింట్‌తో మిలమిలా మెరిసిపోతూ ఉంది ఒక బిల్డింగ్. ఆ మేడ పైనుంచి చూస్తుంటే కింద పోయే మనుషులు అంతా తన కంటే ఎంతో లోతులో ఉన్నట్లు, తన కంటె తక్కువగాను కనిపిస్తున్నారు. కొంతమంది దారి వెంట తల వంచుకుని పోతూ ఉంటే, మరి కొంతమంది అటూ ఇటూ చూస్తూ దారి పక్కగా నడుస్తున్నారు.

'వాళ్ళూ మనుషులే, తనూ మనిషే! అయినా, తను వెళ్ళి వాళ్ళ మధ్య నిలబడితే ఎందుకు తనని వాళ్ళతో సమానంగా చూడరు? ఆప్యాయంగా ఎందుకు పలకరించరు? హీనంగా, వాళ్ళ కన్నా ఎంతో తక్కువలో నిలబడినట్లు చిన్న చూపు చూస్తారెందుకు? తన కోసం ఒక్క స్నేహపూర్వకమైన చిరునవ్వుకూడా పూయదు, ఎందుకని? తనని మనిషిగా, మనసున్న మనిషిగా చూడగలిగేవారు ఒక్కరూ లేరా? ఇంత మంది బాటసారుల్లో ఒక్కరూ నా ఇంట ఆతిథ్యం తీసుకోరా?' రోజూ ఇదే ఆలోచన, ఆ బాల్కనీలో నించుని కిందకు చూస్తున్న ఆమెకు.

'తన మనసు లోని ఆర్తి తీర్చే మనిషి ఒక్కరూ లేరా? పోనీ, తనే ఎవర్నైనా లోపలికి రమ్మని ఆహ్వానిస్తే ఎవరు వస్తారు తన కోసం? తను పిలిచినా అందరూ ఆ ఆలోచనతోనే వస్తారు కానీ, తన కోరిక తీర్చడానికి ఒక్కరూ రారు, రారు!' స్వగతం లోనే అనుకుంది ఆమె.

'ఆ అబ్బాయికి ఇరవై, ఇరవై రెండేళ్ళు ఉంటాయేమో? ఆలోచనగా చూస్తున్నట్లుండే కళ్ళు, సూటిగా గట్టి పట్టుదల సూచించే ఆ ముక్కు, స్నేహంగా నవ్వుతున్నట్లుండే ఆ పెదవులు చూస్తుంటే అతను అందరిలా ఆలోచించడనిపిస్తుంది. రోజూ నా మేడ ముందు నించి వెళతాడుగానీ కన్నెత్తి కూడా చూడడు. అతణ్ణే పిలిస్తే? నేను పిలిచాననగానే ఆ కళ్ళు జుగుప్సతో చూస్తే? అమ్మో, నేను సహించ లేను' అనుకుంది భయంగా.

ఇలాగే గడిచిపోయాయి పది రోజులు. అతణ్ణే రోజూ మేడపై నుంచి చూడడం ఆమె దినచర్యగా మారింది. ఆ రోజు ఏమయినా అతణ్ణే లోపలికి పిలవాలనుకుంది. సాయంత్రం ఐదు ఇరవై నిమిషాలవుతూండగా అతను మలుపు తిరిగి వస్తూ కనిపించాడు. ఆమె గుండె దడ ఎక్కువయింది.

'భగవాన్! అతనికి నా పట్ల అసహ్యం మాత్రం కలిగించకు. అతను రానన్నా సహిస్తాను కానీ, ఆ కళ్ళు జుగుప్సతో చూస్తే మాత్రం నేను సహించలేను' అనుకుంది.

అతను లయబద్ధంగా అడుగులు వేసుకుంటూ వచ్చేస్తున్నాడు.

'ఎలా పిలవాలి? ఏమని సంబోధించాలి? బాబూ! అంటే. . .'

"బాబూ!" పిలిచింది ఆమె. అతను ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"బాబూ, నిన్నే." మళ్ళీ పిలిచింది ఆమె పై నుండి.

పైకి చూశాడు అతను. "నన్నా?" అన్నట్లు చూశాడు సందేహంగా.

"అవును" అన్నట్లు తల ఊపి, 'ఒక్కసారి నా ఇంట్లోకి రావూ?" అంది దీనంగా. సందేహంగా చూశాడు అతను.

తరవాత మెల్లిగా ఇంటివైపు నడిచాడు.

ఆమె మనసు ఆనందంతో గంతులు వేసింది. గబగబా మెట్లు దిగి కిందకు పరిగెట్టింది.

గేటు తీసుకుని, ముందున్న తోట వైపు చూస్తూ అతను లోపలికి నడిచాడు. ఆమె తలుపు తీసి, "లోపలికి రండి" అంటూ పిలిచింది గొంతు తడబడుతుండగా.

విశాలమయిన హాల్లో ఎర్రటి కార్పెట్ మీద సోఫాలు, పేము కుర్చీలు అందంగా సెట్లు సెట్లుగా అమర్చి ఉన్నాయి.

"లోపలికి రండి." పక్కకు తొలగి దారి ఇచ్చింది ఆమె.

"అలా కూర్చోండి." సోఫా చూపించి, అతను కూర్చోగానే ఎదురుగా కూర్చుంది. అయిదు నిమిషాలు మౌనానికి ఆహుతి అయాయి.

"ఎందుకు పిలిచారు?" అతనే అన్నాడు మౌనాన్ని భంగం చేస్తూ.

## వసుధ

'అవును, ఎందుకు పిలిచింది? ఏం చెప్పాలి?' ఆమె ఒక్క క్షణం ఆగి, "ఊరికేనే, మాట్లాడదామని" అంది అనేక భావాలతో.

అతను ఆశ్చర్యంగా చూసి, లేవబోయాడు.

ఆమె చప్పున "కూర్చో బాబూ, నేను ఏమీ కోరను నిన్ను, నీ నుంచి ఏదీ ఆశించను. నాకు. . . నాకు తోడు కావాలి, మంచి మనసుతో స్నేహం కావాలి అంతే..." అంది తడబడుతూ.

అతనికి ఏమీ అర్థం కాలేదు. మౌనంగా కూర్చున్నాడు.

"మీ పేరు?" అడిగాడు చాలా సేపటి తరవాత.

నవ్వింది ఆమె. చాలా అందంగా నవ్వింది.

ఒక్క క్షణం ఆగి, "నన్ను చలపతి 'సరోజా' అంటాడు. డేవిడ్ 'రీటా' అంటాడు. మహదేవన్ 'పాపా' అని పిలుస్తాడు. అందరూ 'రాగిణి' అని చెప్పుకుంటారు" అంది. కాస్సేపయాక, "నువ్వు నన్ను ఆ పేర్లు ఏవీ పెట్టి పిలవకు" అంది.

'ఏమిటి ఈమె ఇలా మాట్లాడుతుంది అర్థం కాకుండా?' అనుకున్నాడు.

"ఆశ్చర్యంగా ఉందా, బాబూ, నన్ను చూస్తుంటే? మరి నిన్ను చూస్తే, ఎందుకో నువ్వు అందరి లాంటి వాడివి కాదనిపించింది. నువ్వు నా నించి ఏమీ ఆశించవనిపించింది. నాతో నువ్వు తప్పక మాట్లాడతావనిపించింది. అందుకే పిలిచాను. ఏమీ అనుకోవు కదూ?" అంది ఆమె కొంచెం ఆవేశంగా. ఆమె కళ్ళలో తడి మెరుస్తోంది.

'లేదు' అన్నట్లు తల ఊపాడతను.

"నిన్ను నువ్వు అన్నానని నీకు ఆశ్చర్యంగా ఉందా? నువ్వు నా కన్న అయిదారేళ్ళు చిన్నవాడివయి ఉంటావు. నిన్ను 'మీరు' అనాలనిపించటం లేదు" అంది.

"పరవాలేదు లెండి" అన్నాడతను.

"నువ్వు రోజూ ఇలా వాకింగ్‌కి వెళుతూంటావు కదూ? ఏం చేస్తుంటావు, బాబూ?" అంది ఆమె, అంత సేపటి నించి సరళంగా మాట్లాడుతూ. అతను నవ్వాడు ఈ సారి.

"ఏదో చేయాలనుకుని, ఏం చెయ్యటానికీ లేక ఏడుస్తూంటాను" అన్నాడు కొంచెం హాస్యం మేళవించి.

"అంటే?" అడిగిందామె.

"నా కథ వినాలనుందా? అతి సామాన్యమైన కథే. సగటు మనిషి జీవిత కథలాగే చప్పగా, మరీ మాట్లాడితే

వేడుగా కూడా ఉంటుంది. నాకు ఊహ తెలిసేసరికే నాన్నగారు పోయారు. అన్నయ్యనూ, నన్నూ, చెల్లెళ్ళనీ అమ్మ కష్టంగా, అడిగింది లేదనకుండా పెంచింది. అన్నయ్య చదువయిపోతే తన కష్టాలు గట్టెక్కుతాయని, అన్నయ్య ఉద్యోగం చేసి మమ్మల్నందరిని పెద్ద స్థితికి చేరుస్తాడని కలలు కంది అమ్మ. ఉద్యోగంలో చేరగానే అన్నయ్య తన క్లాస్‌మేట్ 'లలిత'ను ప్రేమించానని, పెళ్ళి చేసుకున్నానని ఇంటికి తీసుకు వచ్చినా, నిర్ఘాంతపోయినా, అమ్మ ఏమీ మాట్లాడకుండా దీవించి, ఇంటికి ఆహ్వానించింది కోడల్ని. కానీ, అన్నయ్య తెచ్చే సంపాదన కొత్త భార్య కోరికలు తీర్చడానికే సరిపోయేది కాదు. అప్పటికీ అమ్మ ఏం మాట్లాడేది కాదు. నేనే కలగజేసుకుని ఒక రోజు 'పుస్తకాలకు, ఫీజులకు కావాలంటే డబ్బు లేదు, వదిన స్నో సీసాలకు, షికార్లకు డబ్బెలా వచ్చిం'దని నిలదీశాను. దానితో వదినకు అవకాశం దొరికింది. మేమంతా తేరగా తినే వాళ్ళమని, దరిద్రులమని ఏవ్వేవో తిట్టింది. అంతటితో ఆపకుండా 'అడ్డమయిన వాళ్ళు తన భర్త సంపాదన మేస్తుంటే భరించలేను, నేను స్నో సీసా కొనుక్కుంటే అరాలు తీస్తారా' అంటూ ఏడుపు ప్రారంభించింది. అన్నయ్యకు ఏం చెప్పిందో ఏమో, ఆయన 'ఏం అనుకున్నా'డో మర్నాటికల్లా వేరే ఇల్లు తీసుకుని వేరే కాపురం పెట్టాడు. అమ్మ ఎంత ఏడ్చినా, నేను క్షమాపణ చెప్పుకున్నా వాళ్ళు ఆగలేదు. అప్పటి నించీ అమ్మ మంచం పట్టింది. ఇల్లు తప్ప మరేం మిగల్లేదు అమ్మడానికి. నేను చదువుకున్న రెండేళ్ళ మెడిసిన్ కోర్సు కాంపౌండరు ఉద్యోగం కూడా ఇప్పించ లేకపోయింది.

చదువు మానేసి, ఇంట్లో కూర్చుని, నిరుద్యోగం అనే అడవిలో పడి కొట్టుకుంటున్నాను. దీంట్లోంచి ఎప్పటికి బయట పడతానో, ఎప్పుడు అమ్మనూ, చెల్లెళ్ళనీ ఒక దరికి చేరుస్తానో? ఇదే ఆలోచన నాకు" అన్నాడతను భారంగా.

ఆమె కాసేపు మాట్లాడకుండా కూర్చుంది.

బాధలు పంచుకుంటే బరువు తగ్గుతుంది. అతనికి తేలికగా అని పించింది, మనసు. "మీకు బోరు కొట్టిందా, చాలాసేపు చెప్పిన?" అన్నాడు.

"లేదు, లేదు. నాతో మనసు విప్పి మాట్లాడేవారు లేరు. వచ్చిన వాళ్ళు వాళ్ళకు కావలసింది మాత్రం తీసుకుని వెళ్ళిపోయారు. వాళ్ళకు నా మాటలు వినాలనీ, నా బాధ అర్థంచేసుకోవాలనీ ఉండదు. నా కోపం ఆలోచించే వారు లేక, నాతో మనసు విప్పి మాట్లాడేవారు లేక అల్లాడి మంచీ ఈ ఎడారిలో అలమటిస్తూ ఉన్నాను. నీ విలా మాట్లాడటం నా కెంతో సంతోషంగా ఉంది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. చెప్పు, బాబూ, ఇంకే మయినా చెప్పు" అంది ఆమె ఆర్తిగా.

కదిలిపోయాడు అతను.

"ఇంకేం ఉన్నాయి చెప్పటానికి కదిలిస్తే రాలే కన్నీళ్ళు తప్పా? ఏవో మిగల్చేరు. ఆ కన్నీళ్ళతోనే గుండెల మంటలు ఆర్పుకుని, ఆ కన్నీళ్ళతోనే కడుపులు నింపుకుని, 'ఏ రోజుకైనా మా రోజు రాకపోతుందా?' అన్నట్లు ఆశగా భవిష్యత్తులోకి చూడటం ఒకటే మిగిలింది" అన్నాడతను విరక్తిగా.

'నేనే బాధలు మోయలేక పోతున్నాననుకుంటే, ఇతనెన్ని బాధ్యతల బరువులు మోస్తున్నాడూ?' అనుకుంది బాధగా.

వాతావరణం తేలిక చేయాలని, "పాటలు వింటావా, బాబూ?" అంది.

"ఏవి కావాలో సెలెక్ట్ చేసుకో, పెడతాను." కొన్ని రికార్డ్సు అందిస్తూ అంది.

'నా పెరహే తవ దీవా', 'ఓ బాటసారి', 'పిలిచిన బిగువటరా', 'ఎవరు ఏమని విందురూ?' అన్నీ భానుమతి రికార్డ్సే దాదాపు!

"అన్నీ భానుమతి రికార్డ్సే కొన్నట్లున్నారు. అంత ఇష్టమా మీకు?" అన్నాడతను.



"చాలా కష్టం. ఆ పాటలు వింటూ నా బాధల్ని, ఈ లోకాన్నే మరిచిపోతాను నేను. 'ఓ బాటసారి, నను మరువకోయీ'—ఆ పాట వింటూంటే చచ్చిపోయే క్షణంలో కూడా ఆ పాట వింటూ, తిరిగిరాని ఆ బాటసారి కోసం ఎదురుచూస్తూ చచ్చిపోవాలని ఉంటుంది నాకు" అం దామె.

ఆమె కోరిక వింటూ అతను, 'ఈమె వేశ్యా? అందరూ చిత్రించేటంత హీనమయినదా?' అనుకున్నాడు.

'మల్లీశ్వరి' రికార్డ్ అందించాడు. పెట్టి, లోపలికి వెళ్ళిం దామె.

'ఎవరు ఏమని విందురూ? ఎవ్వరేమని కందురూ? ఈ జాలి గాథ?' అద్భుతంగా విషాదగీతం ఆలపిస్తోంది భానుమతి.

ఆమె వచ్చింది—ప్లేట్లో స్వీట్లు, బిస్కట్లు, టీ తీసుకుని.

అతను "ఎందుకండీ ఇవన్నీ?" అన్నాడు.

"తీసుకో, బాబూ! నా ఇంటి ఆతిథ్యానికై వచ్చే వారు ఎందరో ఉన్నా, నా అతిథిగా నువ్వే మొదట వచ్చావు. తీసుకో, బాబూ, నా తృప్తికోసమన్నా తీసుకో" అంది ఆమె.

పాటలు వింటూ టిఫిన్ తిన్నాడు అతను.

టీ కప్పులోకి వంచి అతనికి ఇచ్చింది ఆమె.

"మీరూ తీసుకోండి." అతను ఇంకొక కప్పులోకి కొద్దిగా టీ వంచి, అందించాడు ఆమెకు. అందుకుంటుంటే ఆమె కళ్ళు చెమర్చాయి.

ఇద్దరూ టీ తాగారు.

సంధ్య చీకట్లు దట్టంగా ముసురుకుంటున్నాయి.

"నేను వెళతానండీ!" అన్నా డతను లేస్తూ.

కాసేపు కూర్చోమనలేకపోయింది ఆమె. తన బ్రతుకు కళ్ళారా అతనికి చూపించటం ఆమె కేమాత్రమూ ఇష్టం లేదు.

"రేపు వస్తావా, బాబూ?" అంది.

"రాను అనడానికి నాకేం పెద్ద రాచకార్యా లున్నాయి?" అన్నాడు.

"అయితే, రేపు తప్పకుండా రావాలి, బాబూ" అం దామె.

"అలాగే, ఈ రోజుకు సెలవు" అంటూ బయటకు వెళ్ళిపోయా డతను.

'ఈమె చాలా విచిత్రమయిన మనిషిలా ఉంది' అనుకుంటూ ఇంటికి చేరాడు అతను.

మరునాడు సాయంత్రం అయిదు కాగానే ఆమె ఇంటికి చేరాడు అతను.

"ఆ, బాబూ!" సంతోషంగా ఆహ్వానించింది ఆమె.

అతను కూర్చుంటూ, "మీరు ఏమీ అనుకోనంటే, మీ కథ వినాలని ఉంది నాకు. ఇంత మంచి మనస్సుండి, అభిరుచి ఉండికూడా మీ లాంటి బ్రతుకు ఎందుకు బ్రతుకుతున్నారో తెలుసుకోవాలని ఉంది. మీకు అభ్యంతరం లేకపోతే చెప్పండి" అన్నాడు.

"అభ్యంతరమా? చెప్పడానికి అభ్యంతరం లేదు, బాబూ. కానీ, విన్నాక నీవు నాతో మాట్లాడడానికికూడా అసహ్యించుకుంటావేమో!"

"ఫరవాలేదు, చెప్పండి. మీ కథ ఎలాంటిదయినా నేను మౌనంగానే వింటాను" అన్నాడు. ఒక్క క్షణం ఆగి మొదలు పెట్టింది ఆమె:

"మా అమ్మ, నాన్న ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అన్నయ్యనూ, నన్నూ ఎంతో గారాబంగా, కోరితే కొండ మీద కోతి నయినా తెచ్చి పెడుతూ ముద్దుగా పెంచారు మమ్మల్ని. అన్నయ్య ఎప్పుడూ క్లాసులో వెనకగా ఉండేవాడు. వాడికంటే చిన్న దాన్నయినా నేను పై క్లాసుల్లోకి వెళుతున్నాను, వాడుమాత్రం ఎస్. ఎస్. సి. పాస్ కాలేకపోయాడు. అమ్మ, నాన్న నన్ను మెచ్చుకుంటూంటే వాడికి చాలా కోపంగా ఉండేది. నేను పి. యు. సి. లో చేరిన కొత్తలో మా ఇంటి ఎదురుగా ఉన్న రాము, నేను పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. నా పి. యు. సి. కాగానే రాము మా నాన్న గారిని అడుగుతానని చెప్పాడు. రాము వాళ్ళ నాన్నగారు బిజినెస్ మెన్. ఆయనకు రాము పైన చాలా ఆశలు ఉన్నాయని నాకు తెలుసు. అయినా, రామూ మీద నమ్మకంతో ఆశలు పెంచుకున్నాను నేను. నా కిలాంటి రాత రాసి ఉంటే అంత అదృష్టం ఎలా దక్కుతుంది? ఆ రోజు సాయంత్రం నాన్న గారు పనిచేస్తున్న కంపెనీ కారు ఆక్సిడెంటయి నాన్నగారు, డ్రైవర్, మరో అసిస్టెంట్‌కూడా చనిపోయారు. నాన్నగారు పోవటంతోనే మా బ్రతుకులు హీనాతిహీనమయి పోయాయి. ఆదుకోవటానికి పెద్ద వాళ్ళ అండ లేదు. అమ్మ పిచ్చిదయి పోయింది. నేను చదువు ఆపేశాను. అన్నయ్యను అడ్డు పెట్టే వాళ్ళు లేకపోవడంతో జులాయిగ తిరుగుళ్ళు మొదలు పెట్టాడు.

ఒక రోజు మధ్యాహ్నం నేను నిద్ర పోతుండగా అమ్మ ఇంట్లో నించి వెళ్ళి పోయింది. ఆ రోజు నించీ అమ్మను చూడలేదు నేను. పిచ్చిదో, వెర్రిదో అమ్మే ఉంటే నాకీ గతి పట్టేది కాదు. అన్నయ్య కాస్సేపు బాధ పడ్డా పెద్దగా పట్టించుకో లేదు. ఇంట్లో ఉన్న డబ్బు, అమ్మ నగలు, సామానులు అన్నీ మెల్ల మెల్లగా మాయ మయిపోయాయి. నా కేదయినా ఉద్యోగం దొరుకుతుందేమో అని ప్రయత్నాలు మొదలు పెట్టాను. రాము నన్ను అధైర్య పడవద్దని, ఎమ్. ఏ. పూర్తికాగానే ఇంట్లో చెప్పి పెళ్ళిచేసుకుంటానని ధైర్యం చెప్పేవాడు. ఆ ధైర్యంతోనే బతికేదాన్ని. ఆ రోజు సాయంత్రం రాము వచ్చి, కాస్సేపు మాట్లాడి వెళ్ళాడు. రాము వెళ్ళడం, అన్నయ్య రావడం ఒకేసారి జరిగాయి.

'వాడికి ఇక్కడేం పని? ఎందుకు వచ్చాడు?' అని కోపంగా అడిగాడు.

'చెల్లెలు బతికే ఉందని నీకు గుర్తు లేకపోయినా, అనాథను చూసి పోదామని మనిషిగా వచ్చాడు.' నేనూ కోపంగానే అన్నాను.

'సెల్ఫిష్. ఎవర్ని చూసుకుని ఇంత పొగరు?' కోపంతో వణికిపోతూ అరిచాడు.

'నిన్ను చూసుకునేట్టే ఇలా ఉంది. ఇలా ఏమైనా అంటే బతక నిస్తాడా వాడు?' అనుకున్నాను మౌనంగా.

'ఆయిన వాడితో ఎందుకు మాట్లాడావు? డబ్బు లేనంత మాత్రాన వెకిలి వేషాలు వేస్తావా?' అంటూ రంకెలు వెయ్యడం మొదలు పెట్టాడు.

గుండె మండిపోతున్నా భరించి ఊరుకున్నాను.

అన్నయ్య అంతటితో ఆగకుండా 'వాడి బాబుతో చెప్పి, అడిగి వస్తాను ఈ తమాషా ఏమిటో?' అంటూ నేను ఆపబోయినా ఆగకుండా వెళ్ళి పోయాడు.

ఆ రాత్రి పది దాటినా అన్నయ్య రాలేదు. అర్ధరాత్రి ఎవరో తలుపు తీసి, ఇంట్లోకి జొరబడి నా మీద పడ్డారు. అంతా అయిపోయాక అన్నయ్య వచ్చాడు. వాళ్ళు పారిపోతుంటే పట్టుకుని ఎవరు చేయించారో చెప్పమని చావ గొట్టాడు. రాము వాళ్ళ నాన్నగారు ఇలా చేయమన్నారని చెప్పి పారిపోయారు వాళ్ళు. 'నేను అడిగితే కోడల్ని చేసుకుంటానని తియ్యగా మాటలు చెప్పి, ఇల్లు కూలుస్తావురా, బద్మాష్!' అంటూ అన్నయ్య రంకెలు వేస్తూ వెళ్ళి ఆయన్ని చావగొట్టాడు. నాకు స్పృహ తప్పి పోయింది. తిరిగి నాకు స్పృహ వచ్చేసరికి అన్నయ్యకు సంవత్సరం రోజులు జైలు శిక్ష పడిందని తెలిసింది. ఎక్కడికి వెళ్ళాలో, ఎందుకు బతకాలో తెలియలేదు.

ఇల్లు గలవాళ్ళు 'చెడిపోయిన ఆడ పిల్లవు, ఇక్కడ ఉండటానికి వీలు కాదు' అని మొహం మీదే తలుపు వేశారు.

నీటికొరత కారణంగా ఈరోజు నుండి మీకెవరికో ... తేవాలి!



